భారత భాగ్య సమృద్ధి యజ్ఞంలో ఈటల రాజేందర్



అబిడ్స్: సీతారామ్‌బాగ్‌లో మాధవీలత కొంపెల్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారత భాగ్య సమృద్ధి యజ్ఞంలో బీపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పాల్గొన్నారు. సీతారామ్‌బాగ్ ఆలయంలో కొనసాగుతున్న ఈ మహాయజ్ఞం ఈనెల 27న ముగుస్తుంది. ఈటల రాజేందర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భారత భాగ్య సమృద్ధి కోసం మాధవీలత కొంపెల్ల ఇంత పెద్ద యజ్ఞం నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. సమాజం సస్య శ్యామలంగా ఉండేవిధంగా భారతదేశం మరింత అభివృద్ధి చెందే విధంగా ఈ యజ్ఞం నిర్వహిస్తున్నారన్నారు.

'ఎంఐఎంకు ఓటమి తప్పదు'

నాంపల్లి: మతోన్మాద ఎంఐఎంకు ఈసారి ఓటమి తప్పదని నాంపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మహ్మద్ ఫిరోజ్ ఖాన్ తెలిపారు. ఎంఐఎం అభ్యర్థుల ప్రకటన నేపథ్యంలో ఆయన శుక్రవారం ఏసీగార్డ్స్‌లోని యేటూరి టవర్స్‌లోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఎంఐఎం తొత్తులుగా వ్యవహరిస్తున్నాయని, ఆ మూడు పార్టీలు ఒక్కటేనని విమర్శించారు. 6న తాను నామినేషన్‌ను దాఖలు చేస్తానని, మతం ఆధారంగా చేసే విద్వేష రాజకీయ కాలం చెల్లిందని హెచ్చరించారు. అనంతరం ఆయన మిమిక్రీ కళాకారుడు అశోక్ కుమార్ రచించి స్వరపరిచిన ఫిరోజ్ ఖాన్ ప్రచార గీతాన్ని విడుదల చేశారు. ఫిరోజ్‌ఖాన్ సతీమణి లైలా ఖాన్, నేతలు బుక్క రమేష్, జి.వెంకటేష్, మాదాసు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మజ్లిస్ పార్టీకి కంచుకోట 'పాతబస్తీ'

- పాతబస్తీలో పార్టీ జెండానే ముఖ్యం.. అభ్యర్థులు కాదు..
- పార్టీ జెండాపై ఎవరైనా విజయం సాధిస్తారనే మజ్లిస్ ధీమా..
- ఇద్దరు సిట్టింగ్‌లకు నో ఛాన్స్..
- ఈసారి ఇద్దరు మాజీ మేయర్లకు పార్టీ టికెట్లు
- ఇరువురు తొలిసారి అసెంబ్లీ స్థానాలకు పోటీ
- మజ్లిస్ పార్టీలో అభ్యర్థుల స్థాన చలనం మామూలే



ముంతాజ్ అహ్మద్ ఖాన్



సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ

చార్మినార్: మజ్లిస్ పార్టీకి పాతబస్తీ దశాబ్దాలుగా కంచుకోటలాగా కొనసాగుతోంది. అభ్యర్థులకు స్థాన చలనం జరిగినా.. పార్టీ జెండాపై ఘన విజయం సాధిస్తున్నారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు శాసన సభ నియోజకవర్గాల్లో ఐదు నియోజకవర్గాల అభ్యర్థులను శుక్రవారం హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రకటించారు. మిగిలిన బహదూర్‌పురా పెండింగ్‌లో ఉంది. మరో నియోజకవర్గమైన గోషామహల్ నియోజకవర్గం నుంచి తమ అభ్యర్థిని మజ్లిస్ పార్టీ ఎన్నికల బరిలో దింపదు. చాంద్రాయణగుట్ట నియోజకవర్గం నుంచి తిరిగి అక్బరుద్దీన్ ఒవైసీకి, కార్వాన్ నుంచి కౌసర్ మోహియుద్దీన్, మలక్‌పేట్ నుంచి అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలలకు టికెట్ లభించగా.. చార్మినార్, యాకుత్‌పురాల నుంచి సిట్టింగ్‌లకు కాకుండా వేరే వారికి కేటాయించారు. చార్మినార్ నుంచి మాజీ మేయర్ మీర్ జుల్ఫీకర్ అలీకి, యాకుత్‌పురా నుంచి నాంపల్లి సిట్టింగ్ ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్‌కు టికెట్‌లు దక్కాయి. ఇక నాంపల్లి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని నాంపల్లి నుంచి మాజీ మేయర్ మాజిద్ హుస్సేన్‌కు కొత్తగా టికెట్ లభించింది. దీంతో ఈసారి జరిగే ఎన్నికల్లో పాతబస్తీ నుంచి ఇద్దరు మాజీ మేయర్లకు పార్టీ టికెట్లు లభించాయి. వీరిరువురు ఇప్పటి వరకు గతంలో ఎమ్మెల్యే స్థానాలకు పోటీ చేయలేదు. మజ్లిస్ పార్టీలో శాసనసభ నియోజకవర్గాలకు పోటీ చేసే వారికి స్థాన చలనం కల్పించడం మజ్లిస్ పార్టీలో ఎప్పటి నుంచో వస్తోంది. ఒకప్పుడు యాకుత్‌పురా నుంచి పోటీ చేసి విజయం సాధించిన ముంతాజ్ అహ్మద్ ఖాన్‌కు 2018లో చార్మినార్ టికెట్ లభించగా.. అప్పుడు చార్మినార్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీకి యాకుత్‌పురా టికెట్ ఇచ్చి స్థాన చలనం చేశారు.

ఈసారి ఇద్దరు సిట్టింగ్‌లకు నో..

ఇందులో చార్మినార్, యాకుత్‌పురా నియోజకవర్గాలకు సిట్టింగ్ ఎమ్మెల్యేలను పార్టీ అధిష్ఠానం పక్కన పెట్టింది. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోనే ఏ శాసన సభ్యుడు గెలవని విధంగా ఆరు సార్లు విజయం సాధించి డబుల్ హ్యాట్రిక్‌గా చరిత్రల్లోకి ఎక్కిన ముంతాజ్ అహ్మద్ ఖాన్‌కు కూడా మొండి చేయి చూపించింది. అలాగే ప్రస్తుతం యాకుత్‌పురా సిట్టింగ్ ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీకి కూడా ఈసారి టికెట్ లభించలేదు.

ముంతాజ్ అహ్మద్ ఖాన్ 1994లో మజ్లిస్ బచావ్ తహ్రీఖ్(ఎంబీటీ) పార్టీ టికెట్‌పై..

1994లో మజ్లిస్ బచావ్ తహ్రీఖ్(ఎంబీటీ) పార్టీ టికెట్‌పై యాకుత్‌పురా శాసన సభ నియోజకవర్గం నుంచి మొదటి సారి విజయం సాధించిన ఆయన అనంతరం మజ్లిస్ పార్టీలో చేరి వరుసగా 1999, 2004, 2009, 2014 ఎన్నికల్లో యాకుత్‌పురా నుంచి విజయం సాధించారు. 2014 వరకు యాకుత్‌పురా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా కొనసాగిన ఆయన ఈసారి కూడా చార్మినార్ నుంచి పోటీ చేయడానికి ఎంతో ఎదురు చూశారు. ఇక 2018లో చార్మినార్ నుంచి మజ్లిస్ పార్టీ టికెట్‌పై ఆరో సారి పోటీ చేసి డబుల్ హ్యాట్రిక్‌గా నిలిచిన ఆయనకు ఈసారి టికెట్ లభించలేదు.

సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ 2004లో చార్మినార్ నుంచి..

సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ 2004లో చార్మినార్ నియోజకవర్గం నుంచి మజ్లిస్ పార్టీ టికెట్‌పై పోటీ చేసి ఘన విజయం సాధించారు. అలాగే వరుసగా 2009, 2014 ఎన్నికల్లో కూడా చార్మినార్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఇక 2018 ఎన్నికలలో స్థాన చలనం జరిగి చార్మినార్ నుంచి కాకుండా యాకుత్‌పురా నియోజక వర్గం నుంచి పార్టీ టికెట్ లభించగా.. ఎన్నికల బరిలోకి దిగిన ఆయన ఘన విజయం సాధించారు. ఈసారి కూడా పోటీకి సిద్ధంగా ఉన్నప్పటికీ.. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు పోటీ నుంచి విరమించుకున్నారు. ఈ స్థానం నుంచి నాంపల్లి సిట్టింగ్ ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ పోటీ చేస్తున్నారు. ఇలా మజ్లిస్ పార్టీలో స్థాన చలనం ఎప్పటి నుంచో వస్తున్న ఆనవాయితీ.

చాంద్రాయణగుట్ట మజ్లిస్ అభ్యర్థి బయోడేటా



అభ్యర్థి పేరు : అక్బరుద్దీన్ ఒవైసీ.
తల్లిదండ్రులు : సుల్తాన్ సలావుద్దీన్, నజీమా బేగం
పుట్టిన తేదీ : 1970 జూలై 14.
భార్య పేరు : సబినా ఫర్జానా.
పిల్లలు : ఇద్దరు, కుమార్తె ఫాతీమా ఒవైసీ, కుమారుడు నూరుద్దీన్ ఒవైసీ.
నివాస ప్రదేశం : 8-2-686/బీ/ఏ, రోడ్డు నంబర్-12, బంజారాహిల్స్.
విద్యార్హత : ఎంబీబీఎస్ డిస్కంటిన్యూ.
రాజకీయ నేపథ్యం: మజ్లిస్ పార్టీ శాసనసభ పక్ష నేత, 1999 నుంచి ఇప్పటి వరకు చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యేగా కొనసాగుతున్నాడు. ఒవైసీ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు.

నాంపల్లి ఎంఐఎం అభ్యర్థి బయోడేటా



అభ్యర్థి పేరు : మహ్మద్ మాజిద్ హుస్సేన్
తల్లిదండ్రులు : ఎం.హెచ్.మక్సూద్, ఖైసర్ జహాన్
పుట్టిన తేదీ : 1980
పిల్లలు : ఇద్దరు సంతానం
నివాస ప్రదేశం : అహ్మద్‌నగర్, హైదరాబాద్
విద్యార్హత : బీసీఏ
రాజకీయ నేపథ్యం: మహ్మద్ మాజిద్ హుస్సేన్ మజ్లిస్ ఇత్తేహాదుల్ ముస్లిమీన్ ఎంఐఎం నుంచి కార్పొరేటర్‌గా క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చారు. ప్రస్తుతం మెహిదీపట్నం కార్పొరేటర్‌గా కొనసాగుతున్నారు. 2012-15వ సంవత్సరం వరకు హైదరాబాద్ మహానగర పాలక సంస్థ మేయర్‌గా పనిచేశారు. మాజిద్ హుస్సేన్ తల్లిదండ్రులు ఇద్దరూ ఉపాధ్యాయ వృత్తిలో పనిచేసి పదవీ విరమణ పొందారు.

చార్మినార్ మజ్లిస్ పార్టీ అభ్యర్థిగా మీర్ జుల్ఫీకర్ అలీ



చార్మినార్: చార్మినార్ శాసన సభ నియోజకవర్గం నుంచి మజ్లిస్ పార్టీ అభ్యర్థిగా మాజీ నగర మేయర్ మీర్ జుల్ఫీకర్ అలీని పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. 2018లో చార్మినార్ నియోజకవర్గం నుంచి మజ్లిస్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగిన ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్‌కు ఈసారి టికెట్ దక్క లేదు. హైదరాబాద్ మేయర్‌గా పని చేసిన ఆయన స్వర్గీయ సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ చార్మినార్ శాసన సభ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అప్పటి హుస్సేనీఆలం డివిజన్ కార్పొరేటర్‌గా కొనసాగారు. చార్మినార్‌లోని కోకాకితట్టి ప్రాంతానికి చెందిన ఆయన గతంలో చార్మినార్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ రుణాల కేసులో అభియోగాలు ఎదుర్కొన్నారు.

యాకుత్‌పురా మజ్లిస్ పార్టీ అభ్యర్థిగా జాఫర్ హుస్సేన్ మేరాజ్



చార్మినార్: యాకుత్‌పురా శాసన సభ నియోజకవర్గం నుంచి మజ్లిస్ పార్టీ అభ్యర్థిగా నాంపల్లి సిట్టింగ్ ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్‌ను పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. గోల్కొండ కార్పొరేటర్‌గా కొనసాగిన ఆయన 2014, 2018లో రెండు దఫాలుగా నాంపల్లి నుంచి విజయం సాధించారు. ఈసారి నాంపల్లి కాకుండా యాకుత్‌పురా నుంచి టికెట్ దక్కింది. ప్రముఖ వ్యాపారవేత్త అయిన ఆయన పార్టీకి నమ్మిన బంటుగా కొనసాగుతున్నారు. ఈసారి మాత్రం స్థాన చలనం జరిగింది.

కార్వాన్ మజ్లిస్ అభ్యర్థి ప్రొఫైల్



పేరు : కౌసర్ మోహియుద్దీన్.
భార్య : నజ్మాసుల్తానాకౌసర్ (రెండు పర్యాయాలు జీహెచ్ఎంసీ కార్పొరేటర్)
విద్యార్హత : బీఏ.
వృత్తి : రాజకీయం

మజ్లిస్ పార్టీలో జెండా మోసిన కార్యకర్తగా ప్రజల్లో గుర్తింపు. 17 ఏళ్ల వయస్సు నుంచే మజ్లిస్ కార్యకర్తగా పని చేయడం ప్రారంభించారు. ఆయన భార్య ఒకసారి గోల్కొండ, రెండవసారి నానల్‌నగర్ కార్పొరేటర్‌గా పని చేశారు. అందరితో కలిసి మెలిసి ఉండే మనిషిగా ప్రజల్లో గుర్తింపు. పార్టీకి విశ్వాసంగా ఉండే వ్యక్తి. దివంగత లోక్‌సభ సభ్యులు సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ వద్ద చురుకైన కార్యకర్తగా పని చేశారు. పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ వద్ద కూడా నమ్మినబంటు. ప్రస్తుతం మజ్లిస్ సంగారెడ్డి జిల్లా పరిశీలకుడుగా పని చేస్తున్నారు. 2014, 2019 ఎన్నికల్లో కార్వాన్ నుంచి మజ్లిస్ అభ్యర్థిగా విజయకేతం. ముచ్చటగా వరుసగా మూడవ సారి మజ్లిస్ పార్టీ కౌసర్‌కే అవకాశం కల్పించింది.

మొగిలి సునితారావు నామినేషన్ దాఖలు



అబిడ్స్: గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా మొగిలి సునితారావు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. అబిడ్స్ మున్సిపల్ కాంప్లెక్స్‌లోని రిటర్నింగ్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి వి.విక్టర్‌కు ఆమె నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. అనంతరం సునితారావు మాట్లాడుతూ..గోషామహల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తానన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లను చిత్తుగా ఓడిస్తానన్నారు. అన్నివర్గాల ప్రజలు కాంగ్రెస్‌వైపే ఉన్నారని పేర్కొన్నారు. కాగా గోషామహల్‌లో తొలిరోజు శుక్రవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయని రిటర్నింగ్ అధికారి ఆర్.విక్టర్ తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి సునితారావుతో పాటు సోషలిస్టు పార్టీ అభ్యర్థి బీవీ రమేష్‌బాబులు నామినేషన్ దాఖలు చేశారు.

మజ్లిస్ సెక్యులర్ పార్టీ: ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ పార్టీ పక్కా సెక్యులర్ పార్టీ అని ఆ పార్టీ కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం కార్వాన్ మోగల్‌కా నాలాలో జరిగిన బస్తీలు, కాలనీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలో కుల మతాలు, వర్గాలకు అతీతంగా అభివృద్ధి పనులు జరిగాయని ఇది మజ్లిస్ పార్టీ సెక్యులర్ అని చెప్పడానికి ఇది నిదర్శమని తెలిపారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు వజీఉజ్జమా, బదరుద్దీన్, ఆరూర్‌ఫరాన్ ఉన్నారు.

కార్యకర్తలా పని చేస్తా: మీర్ జుల్ఫీకర్ అలీ

దూద్‌బౌలి: పార్టీకి తానెప్పుడూ కార్యకర్తలా పని చేస్తానని చార్మినార్ నియోజకవర్గం మజ్లిస్ పార్టీ అభ్యర్థి మీర్ జుల్ఫీకర్ అలీ అన్నారు. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తన పేరును ప్రకటించగానే పలువురు పార్టీ కార్యకర్తలు, నాయకులు, పార్టీ అభిమానులు కోకాకీతట్టీలోని ఆయన ఇంటికి చేరుకుని పూల మాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై ఎంతో నమ్మకంతో టికెట్ కేటాయించిన అసదుద్దీన్ ఒవైసీకి ధన్యవాదాలు తెలిపారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు చేయించాలి



జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఆహ్వాన పత్రం అందజేస్తున్న సూర్యప్రకాష్

చార్మినార్: దీపావళిని పురస్కరించుకుని చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆలయ ట్రస్టీ సూర్యప్రకాష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌ను కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్యారసాని వెంకటేష్ పాల్గొన్నారు.

రసవత్తరంగా తెలంగాణ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్

గోల్కొండ: శ్రీనిధి యూనివర్సిటీ తెలంగాణ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ ఘటం ముగిసింది. ఆద్యాంతం పోటాపోటీగా జరిగిన సెమీ ఫైనల్స్‌లో గోల్ఫర్లు అత్యుత్తమ ఆటను ప్రదర్శించారు. లీగ్ సింగిల్స్‌లో ఆర్య వారియర్స్, స్ట్రైకర్స్‌ల గోల్ఫర్లు ఫైనల్ గట్టానికి చేరారు. చివరి వరకు సస్పెన్స్ థ్రిల్లర్‌గా కొనసాగిన పోటీల్లో కేమాటర్స్ ఆర్యవారియర్స్ పీఆఫ్ ఫైనల్‌కు చేరుకున్నాయి. ఫైనల్ పోటీలు గోల్కొండ నయాఖీలాలోని హైదరాబాద్ గోల్ఫ్ కోర్సులో శనివారం జరగనున్నాయి.



డోర్ సమాజ్ సమస్యల పరిష్కారానికి కృషి



సమాజ్ భవనంలో మిత్రకృష్ణను సన్మానించిన ప్రతినిధులు

జియాగూడ: డోర్ సమాజ్ సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ అన్నారు. శుక్రవారం రాత్రి జియాగూడ డోర్‌బస్తీలో గల వీరశైవ కక్కయ్య సమాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన సమావేశానికి ఆయన హాజరు కాగా ప్రతినిధులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం మిత్రకృష్ణ మాట్లాడుతూ.. డోర్ సమాజ్ అభివృద్ధికి తనవంతు సహకారాలు అందిస్తానని సమాజ్ పరిసరాల్లో నిర్మాణంలో ఉన్న భవనం అసంపూర్తిగా ఉండగా సందర్శించారు. ఈ కార్యక్రమంలో సమాజ్ అధ్యక్షుడు దత్తు బాబురావు, సలహాదారుడు వినోద్ చౌగ్లే, ప్రధాన కార్యదర్శి రాజేందర్ గజరే, తులసిదాస్, బాల్‌రాజ్ ఓట్కర్, ఉమేష్ ఓట్కర్, సంగీత, అమృత, అభిషేక్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధిస్తారు'



పులిపాటి రాజేష్‌కుమార్‌ను అభినందిస్తున్న కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్

చార్మినార్: ఈసారి జరిగే ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించనున్నారని కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్ అన్నారు. బహదూర్‌పురా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగిన పులిపాటి రాజేష్ కుమార్‌ను శుక్రవారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు తమ పార్టీ అభ్యర్థులను గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కన్నయ్య లాల్ తదితరులున్నారు.

తెలంగాణలో బీజేపీని గెలిపించాలి



కార్వాన్‌లో ఎన్నికల ప్రచారంలో బీజేపీ అభ్యర్థి అమర్‌సింగ్

గోల్కొండ: మజ్లిస్ పార్టీ ఆవిర్భావం నుంచే గూండాయిజం కొనసాగిస్తుందని బీజేపీ కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి టి.అమర్‌సింగ్ ఆరోపించారు. శుక్రవారం కార్వాన్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి బీజేపీ కేంద్రంలో సాధించిన విజయాల కరపత్రం పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడుతూ.. తెలంగాణలో బీజేపీని గెలిపించాలని కోరారు. పదేళ్లుగా బీఆర్ఎస్ పాలనలో ప్రజలు నానా అవస్థలు పడ్డారని ఆయన అన్నారు. స్వచ్ఛమైన పాలన అందించడం కేవలం బీజేపీకే సాధ్యమని ఆయన అన్నారు. కేంద్రంలో ప్రధాని మోదీ సారథ్యంలో ఉన్న ప్రభుత్వాన్ని, ప్రభుత్వ విధానాలను ప్రపంచ దేశాలన్ని మెచ్చుకుంటున్నాయని ఆయన అన్నారు. బీజేపీ నాయకులు బిజ్వర్‌సింగ్, జి.సునీల్‌యాదవ్ తదితరులున్నారు.



డాక్టర్ ఐశ్వర్యకు పురస్కారాన్ని అందజేస్తున్న సారిపల్లి కొండల్‌రావు

ఆకట్టుకున్న ఫ్యాషన్ షో

గన్‌ఫౌండ్రీ: వయస్సు పైబడిన మహిళలు, వృద్ధుల ఫ్యాషన్ వాక్ అలరించింది. 80 ఏళ్ల వయస్సు పైబడి మహిళ నుంచి 16 ఏళ్ల వయస్సు కలిగిన యువతుల వరకు అందరూ కలిసి శుక్రవారం రవీంద్రభారతిలో చేసిన సాంప్రదాయ వస్త్ర సంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. యువ కళావాహిని, అపర్ణ ఫైనార్ట్స్ ఫౌండేషన్, పాలెస్ ఆర్ట్స్‌ల ఆధ్వర్యంలో మిస్ గ్లోబ్ ఇండియా-2023 అవార్డు అందుకున్న డాక్టర్ ఐశ్వర్యకు యూత్ ఐకాన్ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక బంధు సారిపల్లి కొండల్ రావు మాట్లాడుతూ..భారతీయుల సాంప్రదాయక వస్త్రధారణ ఫ్యాషన్ షోను నిర్వహించడం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. అంతర్జాతీయ ఫ్యాషన్ డిజైనర్ ఆల్కా మనోజ్, వసుశ్రీకపూర్, రాగ డిజైనర్ ఎండీ కరుణా కుంచే, కళా పత్రిక సంపాదకులు మహ్మద్ రఫీ, జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ అధ్యక్షుడు జి.వెంకట్‌రెడ్డి, యువ కళావాహిని అధ్యక్షులు లంకా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మొదటి రోజు పాతబస్తీలో నామినేషన్లు నిల్..

చార్మినార్: నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైనప్పటికీ మొదటి రోజైన శుక్రవారం పాతబస్తీలోని చార్మినార్, యాకుత్‌పురా, బహదూర్‌పురా, చాంద్రాయణగుట్ట తదితర నాలుగు నియోజకవర్గాలలో ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదు. నామినేషన్ పత్రాల స్వీకరణ సందర్భంగా సంబంధిత పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నారు. ఆర్వో కార్యాలయాలకు వంద మీటర్ల వద్ద బారికేడ్లు వేసి బందోబస్తును కొనసాగిస్తున్నారు.

బాలుడి అదృశ్యం



మహ్మద్ రెహాన్ ఖురేషి

గౌలిపురా: బాలుడు అదృశ్యమైన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. తలాబ్‌కట్టా రోడ్డు-2 ప్రాంతానికి చెందిన ఫర్జానా బేగం, మహ్మద్ మహబూబ్ ఖురేషిల కుమారుడు మహ్మద్ రెహాన్ ఖురేషి (15) మీరాలంమండిలోని మదర్సాలో చదువుతున్నాడు. రెహాన్ ఖురేషి కొన్ని రోజులుగా మదర్సాకు వెళ్లకుండా వీధుల్లో తిరుగుతున్నాడు. తల్లి ఫర్జానా బేగం రెహాన్ ఖురేషిని గత నెల 21న రోడ్డు-12లో నివాసముండే తల్లిగారింటికి పంపించింది. రెహాన్ ఖురేషి పౌల్ట్రీ దుకాణానికి వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఫలితం లేకుండా పోయింది. దీంతో తన కుమారుడు కనిపించడం లేదని ఫర్జానా బేగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన వెంకటేష్ ముదిరాజ్



అబిడ్స్: టీడీపీకి చెందిన రాష్ట్ర నాయకుడు బండారి వెంకటేష్ ముదిరాజ్ బీఆర్ఎస్‌లో చేరారు. సీఎం కేసీఆర్ ఆయనకు బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పాతబస్తీ కార్వాన్ నియోజకవర్గానికి చెందిన బండారి వెంకటేష్ ముదిరాజ్ తన అనుచరులతో కలిసి టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ వెంట బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వెంకటేష్ ముదిరాజ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ హయాంలోనే తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందిందని, మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. ఆయనతో పాటు టీడీపీ నేతలు శివరాజ్, బండారి నాగరాజు, దేవేందర్, చంద్రకాంత్, సాయికృష్ణ, మధుకాకతో పాటు పలువురు నాయకులు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.

అలియాబాద్‌లో కాంగ్రెస్ ప్రచారం



దూద్‌బౌలి: బహదూర్‌పురా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పులిపాటి రాజేష్ కుమార్ నియోజకవర్గంలోని అలియాబాద్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన పథకాలతో కూడిన కరపత్రాలను అందజేశారు. ఈ ఎన్నికలలో తనకే ఓటు వేసి గెలిపించాలని కోరారు.

రాజశ్యామల యాగంలో ఆశీష్‌యాదవ్ పూజలు



అబిడ్స్: సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజశ్యామల యాగంలో గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ పాల్గొని పూజలు నిర్వహించారు. శుక్రవారం యాగం ముగింపురోజు ఆయన పూజలు నిర్వహించారు. ఆశీష్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలని సీఎం కేసీఆర్ ఈ మహోన్నత యాగాన్ని నిర్వహించారని పేర్కొన్నారు.

అన్నదానం

గోల్కొండ: తాము చేపట్టిన అన్నదాన కార్యక్రమం నేటితో 600 రోజులు పూర్తి చేసుకుందని గోల్కొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సెకండ్ లాన్సర్ ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ బషీరుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద రోగుల సహాయకులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి, సరోజినీ దేవి కంటి ఆస్పత్రి తదితర పెద్ద పెద్ద ప్రభుత్వ ఆస్పత్రులకు దూర ప్రాంతాల నుంచి పేషంట్లు వస్తారని అన్నారు. అయితే వారి వెంట వచ్చే సహాయకులకు తాము రాత్రి భోజనం అందిస్తున్నామన్నారు. దాతలు, ప్రభుత్వ ఉద్యోగుల సహాయంతో ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ 600 రోజులు పూర్తి చేసుకున్నామని ఆయన అన్నారు.



అన్నదాన కార్యక్రమంలో మహ్మద్ బషీరుద్దీన్

ప్రత్యేక పూజలు



లాల్‌దర్వాజా ఆలయంలో పూజలు చేస్తున్న కృష్ణ యాదవ్

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారిని మాజీ మంత్రి, అంబర్‌పేట నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సి.కృష్ణయాదవ్ శుక్రవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. లాల్‌దర్వాజా నివాసి అయిన కృష్ణయాదవ్ సెంటిమెంట్‌తో అమ్మవారిని దర్శించుకొని ఎన్నికల్లో విజయం సాధించాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. ఆయన వెంట నాయకులు పొన్న వెంకటరమణ, దినేష్ అంబారీ, వినోద్ తదితరులున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

జియాగూడ: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి బాత్‌రూమ్‌లో మృతిచెందిన ఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగుచూసింది. ఎస్ఐ వేణు తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని జియాగూడ కేశవస్వామినగర్‌లో ఉంటున్న టి.సుబ్బారావు (47) వృత్తిరీత్యా సెంట్రింగ్ వర్కర్. గురువారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో బాత్‌రూమ్‌కు వెళ్లిన సుబ్బారావు ఎంతోసేపటికి బయటకు రాలేదు. అనుమానం వచ్చిన అన్న వెంకటయ్య, రాత్రి 11 గంటల ప్రాంతంలో ఇంకా బయటకు రాలేదని వెళ్లి చూడగా మృతిచెంది ఉన్నాడు. దీంతో ఆస్పత్రికి తరలించినప్పటికి మృతిచెందినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ వినియోగదారుల దినోత్సవం

శాలిబండ: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పడిన దినం సందర్భంగా మీరాలం సబ్ డివిజన్‌లో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా తమ విద్యుత్ బిల్లులకు, ఇతర సమస్యల పరిష్కారం కానీ యెడల జీటీఎస్ కాలనీ ఎర్రగడ్డలో గల విద్యుత్ వినియోగదారుల ఫోరమ్-2 కోర్టు (సీజీఆర్ఎఫ్-2) అక్కడా సమస్య పరిష్కారం కానీ యెడల లుంబీని పార్కు బోట్స్ క్లబ్ దగ్గర గల విద్యుత్ అంబుడ్స్‌మెన్ కోర్టులను ఎలాంటి లేకుండా ఉచితంగా ఆశ్రయించకోవచ్చునని విద్యుత్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మీరాలం సబ్ డివిజన్ ఏడీఈ వెంకటేశ్ గౌడ్, మీరాలం సెక్షన్ ఏఈ శ్రీనివాస్, చందులాల్ బారాదరి సెక్షన్ ఏఈ షబ్బీర్ అహ్మద్, అత్తాపూర్, కిషన్‌బాగ్ సెక్షన్స్ ఏఈ సత్యనారాయణ గౌడ్, సబ్ ఇంజినీర్లు, ఈఆర్ఓ సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యుత్ అధికారులు

నాంపల్లిలో ఫ్లాగ్‌మార్చ్

నాంపల్లి: ఎన్నికల నేపథ్యంలో మధ్య మండలం పోలీసులు నాంపల్లి పీఎస్ పరిధిలో ఫ్లాగ్‌మార్చ్‌ను నిర్వహించారు. ఈ ఫ్లాగ్ మార్చ్‌ను డీసీపీ వెంకటేశ్వర్లు హాజరై ప్రారంభించారు. విజయనగర్‌కాలనీ ఐటీఐ సమీపంలోని పెద్దమ్మ గుడి దగ్గర ప్రారంభమైన ఫ్లాగ్ మార్చ్ బజార్‌ఘాట్, నిలోఫర్, ప్యాప్సీ మార్గ్, సింగరేణి భవన్, లక్డీకాపూల్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఆనంద్, ఏసీపీ సంజయ్‌కుమార్, నాంపల్లి సీఐ అభిలాష్‌తో పాటుగా ఖైరతాబాదు, సైఫాబాదు పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లతో పాటుగా సిబ్బంది పాల్గొన్నారు.

